విశ్వసుందరి

శ్రీ K. V. సుబ్బారావు బి. ఏ.

నీలవేణీ నగరాన్ని నీలవదనుడనే రాజు పరిపాలించుచుండెను. ఆరాజు ప్రజలను కన్నబిడ్డలవలె ప్రేమించేవాడు. అతనిభార్య మణికర్ణిక. నీలవదనుడికి రెండవభార్య మణికర్ణిక. మొదటిభార్య సత్యవతి పోయినతరువాత రెండవ వివాహంచేసుకోకూడదని గట్టిపట్టు పట్టుకూర్చున్నాడు. ఎందుకంటే మొదటి భార్య పోతూపోతూ చిన్నారిబాలను తన చేతుల్లో పెట్టిపోయింది, అందుకని వివాహంచేసుకుంటే, ఆవిడ తన చిన్నారిబాల "విశ్వసుందరి"ని సరిగాచూస్తుందో, సహజంగా సవతల్లి ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తుందేమో, అని భయపడ్డాడు. కాని చివరకు పరిస్థితులకు లోబడి మంత్రులసలహాపై మణికర్ణికను పెండ్లాడాడు.

అనుకున్నంతా అయింది. కాపరానికివచ్చిన పదిరోజుల్లోనే తేలిపోయింది మణికర్ణిక పట్టిజిత్తులమారిదని. విశ్వసుందరిని ఆడిపోసుకోవటం మొదలెట్టింది. ఇదంతా చూచి రాజు తనలోతానే కుమిలిపోసాగినాడు. అయినా ఏంచేస్తాడు? తాళికట్టింతర్వాత సర్వాధికారాలూ రాకంటాపోతాయి!

కాలచక్రంతో రోజులు దొర్లిపోతున్నయ్. విశ్వసుందరి నాటానాటా పెరిగి పెద్దమనిషైంది. ఆమె రూపంలో రతీదేవినీ, సుకుమారంలో పార్వతీదేవినీ, విద్యలో సరస్వతినీ, గాంభీర్యంలో లక్ష్మినీ మించిపోయింది. అటువంటి అందాలబాలను వెర్రిబాగులవాడయిన తనతమ్ముడికిచ్చిచేయాలని మణికర్ణికవాదం. దేవికోరిన అన్నికోరికలు తీర్చాడు కాని చూస్తూచూస్తూ వెర్రిబాగులవాడికి తన కూతుర్ని ఇవ్వటానికి సుతారామూ వప్పుకోలేదు మహారాజు. మహారాజు తనమాట నిరాకరించాడని మండిపడింది, ఇంకా ఎన్నో ఎత్తులువేసింది. కాని మహారాజు ముందవి పారలేదు. విశ్వసుందరిని తనతమ్ముడికి కాకుండా ఇతరరాజకుమారునికిచ్చి వివాహం చేస్తుంటే తానుసహించలేదు. ఏవిధంగానూ రాజు బోల్తాపడకపోయేసరికి రాణీ ఒకపన్నుగడపన్నింది. అదేమిటీ అంటే విశ్వసుందరిని మాయోపాయంచేసి చంపటం. తనపన్నుగడకు ఎంతగానో మురిసిపోయింది మనసులోనే.

ఆరోజు మామూలుగా రాణీమందిరంలోనికి వచ్చాడురాజు. రాణి చిరునవ్వుతో స్వాగతమిచ్చింది. ఈ చిరునవ్వు విషపూరితమైనదని మహారాజుకు తెలియకకాదు అయినా నాటక మెంతవరకు ఆడుతుందో చూద్దామని తానూ వేచివున్నాడు.

"మహారాజా!" అంది ప్రేమనొలికిస్తూ

"ఏమిటి?" అన్నాడు.

"విశ్వసుందరి పెండ్లి మీ యిష్టప్రకారం జరగటానికే వప్పుకుంటాను. మీరు వెళ్ళింతర్వాత తీవ్రంగా నేనూ ఆలోచించాను. చాలా సేపు యోచించి యోచించి మన అందాలరాకుమారిని ఆ వెర్రినాగన్నకిచ్చి చేయటమంత తెలివితక్కువలేదు అని నిశ్చయించుకొని నా మనస్సు మార్చుకున్నాను. ఇక మీ యిష్టం" అంది.

"నిజంగానా మహారాణీ!" ఒక్కసారి ఆశ్చర్యపోయాడు.

"మీమీద పట్టువేసి చెపుతున్నాను!" అంది సంగనాచిలా.

"అలాఅయితే దేవీ మనఅమ్మాయికి తగినవరుడు ఏదేశరాజకుమారుడు తగునంటావ్. అంగ, వంగ,

కళింగ, నేపాళ, రాజ్యాలనేకం వున్నాయ్. మనమంత్రికి అమ్మాయి చిత్రాన్నిచ్చి పంపుదాం సరేనా!" అన్నాడు,

"ప్చ్!" అని పెదవి విరిచిందిరాణీ – "మీ పద్ధతి నాకేమాత్రం బాగలేదు. మనమే స్వయంవరం ఏర్పాటుచేసి రాజాధిరాజులకు ఆహ్వానాలు పంపుదాం. ఆ స్వయంవరంలో అమ్మాయికినచ్చినవాడిని ఎన్నుకుంటుంది!" అంది.

ఇంతవరకూ బాగానేవుంది అని అనుకుని, రాజు సరేనన్నాడు. "కాని మహారాజా ఒకషరతు అదేమంతపెద్ద సమస్యకాదు. బహుస్వల్పమయింది. మన అమ్మాయి సామాన్యుడిని వరించటం మీకూ నాకుయిష్టంలేదు, అసమాన్యుడయినవాడూ, బహుబలసంపన్నుడూ, ధైర్యశాలీ, అందగాడూ కావాలి. అటువంటి లక్షణ సంపన్నుని కోసమే నేనీషరతుపెడుతున్నాను. దీనికి మీ అంగీకారముద్రకావాలి –" అన్నది.

"ఏమిటీ నీషరతూ!"ఆశ్చర్యపోయి అన్నాడు.

"అబ్బే ఏమీలేదు. రేపు స్వయంవరానికి బహుబలసంపన్నులనేకమంది వస్తారుకదా; సభామధ్యంలోకి నేను వచ్చి మూడువస్తువుల్ని కోరతాను. నేను కోరిన ఆ మూడువస్తువులనూ తెచ్చి పెట్టటానికి ఏ రాజకుమారుడయితే ముందుకు వచ్చి వాటిని సాధించుకువస్తాడో ఆ ధైర్యశాలికి మన అమ్మాయినిచ్చి కళ్యాణం చేద్దాం"సరేనా! అంది.

"బాగానేవుంది నీ గొంతెమ్మకోర్కెలు నీ కోర్కెలుతీర్చేవాడు ఇహాయీ లోకంలో పుట్టడు" గొణుకున్నాడు.

"అయితే మహారాజా! మన అమ్మాయిని ఒక పిరికి పందకిచ్చి చేయాలనామీవుద్దేశ్యం. నా మూడు వస్తువులనీ తెచ్చిపెట్టనివాడు ఒట్టి పిరికిపంద. అటువంటి పిరికిపందకు ..."

రాజుకు స్వాభిమానంమీద గొడ్డలితో కొట్టినట్లయి, "ఆగు!" అని గర్జించాడు. "నీయిష్టప్రకారమే కానియ్యి" అని వెళ్లిపోయాడు.

"మణికర్ణిక తన పాచిక పారినందుకు ఎంతగానో పొంగిపోయింది. తను కోరిన ఆ మూడు వస్తువుల్ని సాధించటం సాధారణమానవునికి అసాధ్యమయిన పని. ఒకవేళ మూర్ఖించి సాధించుదామనిపోయినా దారుణమైన ప్రమాదాలలోనుంచి తప్పుకురావటం అసాధ్యం-అయినా వాడు గడువులోగా రావాలి కదా"! అని పొంగిపోయింది.

ఇంతలో రాజు అక్కడికి వచ్చాడు.

"మహారాజా! నేను పెట్టిన గడువులోగా మూడు వస్తువులను సాధించుదామని పోయినవాడు తిరిగి రాకపోయినట్లయితే, గడువు రోజు దాటిన మరునాడే విశ్వసుందరిని నా తమ్ముడికిచ్చి పెండ్లి చెయ్యాలి. ఈ షరతుకూడా మీరు ఒప్పుకోవాలి" అంది.

రాజు విధిలేక "సరే"నని బయటకు వెళ్ళిపోయాడు.

అనుకొన్నట్లు స్వయంవరసభ ఏర్పాటయింది. రాజాధిరాజులనేకులు దూరదేశాలనుండికూడా వచ్చారు. ఎవరికివారు ఆ అందాల భరిణను తన దానినిగా చేసుకోవలెనని వువ్విళ్లూరుతున్నారు.

మణికర్ణిక విశ్వసుందరిని తీసుకుని సభా భవనంలోకి వచ్చింది. విశ్వసుందరి ఒకమారు సభనంతా కలియజూచి సింహాసనా ఉపవిష్టురాలయింది.

మణికర్ణిక సభనంతా తిలకించింది – "రాజాధిరాజులంతా శ్రమపడి దూరదేశాలనుంచికూడా వచ్చినట్లున్నారు. వారందరికి నా కృతజ్ఞత. మీలో ప్రతిఒక్కరికికూడా విశ్వసుందరిని పెండ్లిచేసుకోవలెననే అభిలాష లేకపోలేదు. నా కుమార్తె అంత అందాలరాశియై మీ హృదయపీఠాల్లో అలంకరించినందుకు ఆమెకు మాతనయిన నేనెంతో గర్విస్తున్నాను. సభాసదులందరికి ఒక విషయం మనవిచేసు

కుంటున్నాను. నా కుమార్తెను వివాహం చేసుకోనటానికి ముందుకువచ్చే ధీరుడు ముందుగా నేను కోరే మూడు వస్తువులను నిర్ణయించిన గడువులోగా తీసుకు రావాలి. అలా నేను కోరే మూడు వస్తువుల్ని సాధించటానికి వెనుదీయని మగవాడెవడయినావుంటే ముందుకు రండి! ఆ ధీరుడికి మొట్టమొదట సాధించవలసిన వస్తువేదో చెప్పుతాను!" అంది.

మహారాణి ఆ మూడు వస్తువుల విషయం ఎత్తేసరికి ఎవరికివారు చల్లగా జారుకున్నారు. సభ మొత్తం ఖాళీ అయింది. కాని ఆ మూల ఎవరో యువకుడొకడు లేచి రాణి ముందుకువచ్చి నమస్కరించి - "మహారాణీ! నీవు కోరే వస్తువులలో మొదటి దేదో చెప్పు సాధించుకువస్తాను" అన్నాడు నిర్భయంగా.

ఆ యువకుని ధైర్యసాహసానికి సభ మొత్తం ఆశ్చర్యపోయింది. రాజు వింతపోయాడు. విశ్వసుందరి ఆత్రంగా ఆ యువకుని మోములోకి తొంగి చూసింది. మహారాణి తొణకలేదు. "నీకేమయినా ప్రాణాలమీద ఆశవుందా!" అంది ఆశ్చర్యం నటిస్తూ.

"ఆశ నిరాశల విషయం మీ కనవసరం. వేగిరం మీ మొదటి వస్తువుపేరు చెప్పండి." అన్నాడు యువకుడు.

"సరే చెప్పుతాను విను - ఇక్కడికి దక్షిణంగా పదిక్రోసుల దూరంలో ఒక విచిత్ర వృక్షంవుంది. ఆ వృక్షాన్ని ఆధారంగా తీసుకొని వారంరోజులలోగా మాణిక్యహారాన్ని సాధించుకొని రావాలి. గడువు దాటిన తర్వాత వచ్చావో ... శిరచ్ఛేదం!" "అది మామూలేగా!" అని నవ్వుకుంటూ ఒక చూపు విశ్వసుందరివైపు విసిరాడు. ఆమె సిగ్గుతో తల వంచుకుంది. రాణి అదిరిపడింది. "అయినా వీడు అన్ని గండాలుదాటి, ఆ గడువులోగా బయటపడినప్పుడు మాటకదా" అ మనసులోనే సమాధానం చెప్పుకుంది. రాజు మాత్రం ఆ యువకుని ధైర్యానికి అబ్బురపడి - "అబ్బాయ్, నీ పేరేమిటో తెలుసుకోవచ్చా? -" అన్నాడు.

"నా పేరా, భువనసుందర్! సెలవిప్పించండి" అని గిరుక్కున వెనక్కు తిరిగాడు.

2

రాజభవనం దాటినవెనుక భువనసుందర్ దక్షిణ దిశగా బయలుదేరాడు. శ్రమ అయినా భరించి పదిక్రోసుల దూరంనడిచి చివరకు ఒక పెద్ద ఎడారిలో విచిత్రవృక్షం కనిపించింది. ఆ చెట్టును గురించి విచిత్రపడటానికి రెండే రెండు కారణాలున్నట్లు కనిపెట్టాడు. ఎడారిలో అంత పెద్ద వృక్షంవుండి ఆకులతో పూలతో శోభిల్లుతూ వుండటం; రెండవది మరీ విచిత్రమయినది. అదేమిటి అంటె ఆ చెట్టుకు కొమ్మలు నాలుగేవున్నయ్. నాలుగు కొమ్మలు నాలుగు దిక్కులకు వ్యాపించివున్నయ్. అందులోను ఒక కొమ్మ ఆకాశానికి వ్యాపించివుంది. ఇది మరీ విచిత్రంగావుంది.

సరే ఏమయినాసరే దీనివిచిత్రమేమిటో పరిశోధించినదాకా వెనుకంజ వేయకూడదనుకున్నాడు. వెంటనే నడుముకు కండువాబిగించి చెట్టు ఎక్కాడు. నాలుగుకొమ్మలనూ నిశితంగా పరిశీలించి ఆకాశం వైపుకు చొచ్చుకుపోయిన కొమ్మ నెక్కిసాగిపోసాగాడు. అలా ఆ కొమ్మవైపు ఎంతదూరం పోయినా అంతు దొరకటంలేదు. పైగా నిముష నిముషానికి కొమ్మపరిమాణం సన్నగిలసాగింది. అయినా ధైర్యంతో సన్నటికొమ్మను పట్టుకొని ముందుకుపోసాగాడు. కాని కొమ్మ మరీ సన్నమయింది. చేతులు చెమటపట్టిపోయి పట్టుకూడా అనటంలేదు. అలానే మూర్ఛించి కొమ్మవెంట ఆకాశపుటంచులవరకూ వచ్చేశాడు. అయితే యింతలో దురదృష్టవశాత్తు కొమ్మవిరిగిపోయింది. విరిగిన కొమ్మతోపాటు భువనసుందర్ కూడా క్రిందపడిపోసాగాడు.

ఇంతలో ఒక గంధర్వకన్య ఆకాశమార్గాన గంధర్వలోకానికి వెళుతూ క్రిందపడి పోతూన్న ఆయువకుని చూచి కెవ్వున కేక వేసింది. గంధర్వ కన్యకేకకు చలికత్తె

అదిరిపడి అటుచూసింది. "అయ్యోపాపం! ఆ యువకుడు కొమ్మవిరిగి క్రిందపడిపోతున్నాడు. ఇంకా కొంచెంసేపాగితే అతడు కొండమీదపడి తలబ్రద్దల కావటం తథ్యం" అంది చెలికత్తె

"పద అటువైపు మనవిమానంత్రిప్పు ఆయువకుని రక్షిద్దాం" అంది చెలికత్తె. జర్ మనివిమానం అటు పోనిచ్చింది. ఇంతలో యువకుడు సరాసరివచ్చి గంధర్వకన్య విమానంలో పడిపోయాడు.

స్మృతితప్పిపోయిన ఆ యువకుని తీసుకొని గంధర్వలోకానికి బయలుదేరింది. 'నెమ్మదిగా ఆ యువకుని మోహంమీద చన్నీళ్లుచల్లింది. భువనసుందర్ మెలుకువవచ్చి కళ్లువిప్పాడు, ఎదురుగా అతిలోకసుందరి. "ఎవరుమీరు, నేను ఇక్కడకు ఎలా వచ్చాను?" అన్నాడాశ్చర్యంగా.

గంధర్వ కన్య నవ్వుతూ సమాధానం చెప్పింది. ఆమె అతడిని రక్షించినవిధమంతా చెప్పేసరికి ఆశ్చర్యపోయాడు.

"నిజంగా మీ ఋణం వేయిజన్మలకయినా తీర్చుకోలేను" అన్నాడు చేతులు జోడించి.

"అయితే మీపేరేమిటి" అని అడిగింది గంధర్వ కన్య.

"భువనసుందర్!" జవాబిచ్చాడు.

"ఓహో అల్లాగా — అయితే తమరు ఏ పనిమీద యిలా బయలుదేరారూ!"

భువనసుందర్ అసలు తనుబయలుదేరిన విషయం యావత్తూ పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

గంధర్వకన్య మందహాసంచేసి ఒళ్లువిరిచింది వయ్యారంగా.

"మాణిక్యహారం దొరకటం కష్టమయినపనే" అంది.

"అయితే ఇక హారం లభింపదా నేనా మణికర్ణిక ఖడ్గానికి బలి కావాలసిందేనా. నా వీరత్వం యిలా మట్టిపాలు కావలసిందేనా" అన్నాడు. "భయపడకయ్యా భువనసుందర్! మాణిక్యహారం లభించాలనంటే దానికోసం ఎంతయినా త్యాగంచెయ్యాలి." అంది.

"చెప్పు ఏత్యాగమయినా చేస్తాను. నా ప్రాణం కావాలా? తీసుకో" అంటూ కత్తితీశాడు.

ఆమె భువనసుందర్ చేతిని పట్టుకొని — "ఆవేశపడకయ్యా యువకుడా! పద చేయవలసిన త్యాగమేమిటో కండ్లారా నీవే చూద్దువుగాని" అని భువనసుందర్‌ను వెంటబెట్టుకొని మేడచివరి అంతస్తుపై మెట్ల దగ్గరకువచ్చింది.

"క్రిందచూడు భువనసుందర్, సలసలా కాగిపోతున్న నూనెబావినిచూశారా. వెనుకముందాలోచించకుండా నీఅభీష్టాన్ని తలచుకొని అందులోకి దూకు. ప్రాణాలమీద తీపిచేత ఒకసారి వెనక్కుతగ్గి తిరిగి దూకావో చచ్చిపూరుకుంటావ్." అంది.

"సరే నా అభీష్టంకోసం నేనేత్యాగమయినా చేస్తాను" అని కండువా నడుముకుబిగించి బావిలోకి దూకాడు భువనసుందర్.

భువనసుందర్ కండ్లు తెరచిచూచేసరికి తాను ఓ నది ఒడ్డున ఇసుకతిన్నెమీద పడివున్నాడు.
ఆ సరస్సు ఎంతో విచిత్రమయింది. పంచరంగుల జలంతో రమణీయంగా ప్రకాశిస్తోంది. ఆ సరస్సు అందానికి ముగ్ధుడయి అలానే కూర్చుండిపోయాడు. ఇలా చూస్తుండగా వున్నట్లుండి సరస్సు అటుగా నుండి ఒకపద్మం బయటకొచ్చింది. ఆ పంచవన్నెల పద్మంలో గాంధర్వకన్య కూర్చునివుంది. ఆమె మాణిక్యహారం మెరిసిపోతోంది. పద్మంసరస్సు ఒడ్డుకువచ్చింది.

(సశేషము)